
ప్రజాశక్తి
మంగళవారం 27 జూన్ 2023
5



తాగునీటి సమస్యపై వినతి

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో మంచి నీటి సమస్యను పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి సూర్యనారాయణ మండల పరిషత్ అభివద్ధి అధికారిని ఉషారాణికు వినతి పత్రం అందజేశారు. అడపవలస గ్రామంలో గత వారం రోజులుగా బోరు మరమ్మతుకు గురికావడంతో గ్రామ గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో గ్రామంలో చేతిపంపు బోరు నుంచి బురద నీరు రావడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాగర పంచాయతీ సెక్రెటరీ వలిభా, గిరిజన సంఘం నాయకులు వి.సింహచలం, వి.ఆనంద్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మహోద్యమంలా పోరుకేక పాదయాత్ర

అల్లూరి జిల్లా నుంచి ఏలూరు జిల్లాలోకి ప్రవేశం - కొనసాగుతున్న సంఘీభావ వెల్లువ



శబరి బ్రిడ్జిపై సాగుతున్న పాదయాత్ర

ప్రజాశక్తి రాజమహేంద్రవరం ప్రతినిధి, విఆర్ పురం, కూనవరం

పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుకేక మహా పాదయాత్ర మహోద్యమంలా సాగుతోంది. వేలాదిమంది పోలవరం నిర్వాసితులు ఈ పోరుయాత్రలో భాగస్వాములయ్యారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో జరుగుతున్న ఈ మహా పాదయాత్రకు జననీరాజనం పెట్టారు. హారతిలో స్వాగతం పలికి, వీర తిలకం దిద్దారు. విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఎటపాక మండలం నెల్లిపాకలో ఈ నెల 20న ప్రారంభమైన ఈ పాదయాత్ర ఏడో రోజైన సోమవారం ఉదయం విఆర్.పురం మండలం రేకపల్లి నుండి ధర్మ తాళ్లగూడెం, కూనవరం మీదుగా ఏలూరు జిల్లాలోకి జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా విఆర్.పురంలో పుచ్చలపల్లి సుందరయ్య స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే రేఖపల్లిలో బండారు చంద్రరావు, బత్తుల భీష్మారావు, శ్యామల వెంకటరెడ్డి, పులి రామయ్య, బిఎస్ రామయ్య, మడివి ముకయ్య, మడకం పంతులు, మార్త శ్రీరామ్మూర్తి, బొప్పన భీమయ్య స్మారక స్థూపానికి పాదయాత్ర బృందం నివాళులర్పించింది.

విఆర్.పురంలో మాజాపు యశోద అనే మహిళా వ్యాపారి మాట్లాడుతూ గతేడాది వరదల నుండి ఇప్పటికీ కోలుకోలేదని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం ఎటువంటి సహాయము అందించలేదని చెప్పారు. తమ తండ్రికి సమీపంలోని కొండపై అంత్యక్రియలు చేశామని వాపోయారు. రేఖపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరిందని, పక్కనున్న ఆస్పత్రి నిర్మాణం సంవత్సరాలుగా కొనసాగుతుందని తెలిపారు.

విఆర్.పురం మెయిన్ రోడ్డు మీదుగా శబరి వంతెన దాటి పాదయాత్ర కూనవరంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంలో ఓవైపు గల గల పారే శబరి నది, మరోవైపు ఉప్పొంగే ఉత్సాహంతో తరలివచ్చిన పోరు కేక మహాపాదయాత్ర కన్నుల పండుగగా నిలిచాయి. ఆయా ప్రాంతాల్లో నివసించే సాధారణ ప్రజానీకం సైతం పాదయాత్ర బృందంతో కలిసి నడిచింది. ఉద్యమ నాయకులతో పలువురు సెల్ఫీలు తీసుకున్నారు. మహా పాదయాత్రకు ఇంటికొకరు తరలిరావాలని పోరు కేక సారథులు పిలుపునిచ్చారు. కూనవరం బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభ సందర్భంగా ఆ ప్రాంతమంతా జనంతో కిటకిటలాడింది. ట్రాఫిక్ రద్దీ నెలకొనడంతో, రెడ్ షర్ట్ వాలంటీర్లు వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. బహిరంగ సభ అనంతరం గోదావరి ఇసుక తిన్నులమీదుగా పాదయాత్ర ముందుకు కదిలింది. పడవ గోదావరి నదిని దాటి ఏలూరు జిల్లా రుద్రమకోటకు చేరుకుంది. ఈ పాదయాత్రలో ఎమ్మెల్సీ ఐవి, సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, ఎం.వాణిశ్రీ, లోతా రామారావు, విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, మేకల నాగేశ్వరరావు, సోయం చిన్నబాబు వడ్లాది రమేష్, లక్ష్మణరావు, సత్యనారాయణ, పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, పాయం సీతరామయ్య, ఆవుల ఉపేంద్ర, ఈశ్వర్, గిరిజన జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, ఎంపీటీసీ ప్రదీప్ కుమార్, ప్రజాప్రతినిధులు జయసుధ, అమ్మాజీ పాల్గొన్నారు.



విఆర్.పురంలో పుచ్చలపల్లి సుందరయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, ఐవి తదితరులు



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న నిర్వాసిత గ్రామాల నాయకులు



గోదావరి దాటి జిల్లాలోకి ప్రవేశించిన పోలవరం పోరుకేక పాదయాత్ర

తిలకం దిద్దుతూ.. హారతులిస్తూ...

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాకలో మొదలైన పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం కూనవరం చేరుకుంది. అక్కడ నుంచి పాదయాత్ర బృందం పడవలపై గోదావరి దాటి జిల్లాలోని వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట గ్రామంలోకి ప్రవేశించింది. పాదయాత్ర బృందానికి సిపిఎం రాష్ట్ర నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, సిపిఎం జిల్లా కార్యదర్శి రవి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, నిర్వాసితులు స్వాగతం పలికారు. మహిళలు ఎదురెళ్లి పూలమాలలు వేసి బొట్టు పెట్టి హారతులిచ్చి నేతలకు స్వాగతం పలికారు. అనంతరం రుద్రమ్మకోట గ్రామంలో బహిరంగ సభ ఆ మండల నాయకులు ధర్మాల రమేష్, మడిది దుర్గారావు ఆధ్వర్యాన సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా గుర్తించి నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది ముంపు గ్రామాలన్నింటినీ సర్వేలో కలపాలని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో దీక్షలు చేస్తే 13 గ్రామాలను కలిపామని చెప్పి రెండు నెలల తర్వాత ముంపులో లేవంటూ నిర్వాసితులను మోసం చేశారన్నారు. ఎ, బి, సి బ్లాక్‌లతో సంబంధం లేకుండా ముంపు గ్రామాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. టిడిపి మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్, జనసేన మండలాధ్యక్షులు గణేశుల ఆదినారాయణ మాట్లాడుతూ పోలవరం పోరుకేక యాత్రకు తమ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. నిర్వాసితుల సమస్యలు అనేకం ఉన్నాయని, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని చెప్పారు. సిపిఎం ఎన్నో కష్టాలు ఓర్చి నిర్వాసితుల కోసం ఈ పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. నిర్వాసితులంతా ఒక్కటై ముందుకు సాగాలన్నారు. అనంతరం పాదయాత్ర బృంద నాయకుడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను ప్రభుత్వం నిలువునా ముంచేసేందుకు పూనుకుందన్నారు. ప్రతి ఇంట్లోనూ, ప్రతి గ్రామంలోనూ సమస్య ఉందన్నారు. అంతా కలిసికట్టుగా పోరాడినప్పుడే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. వచ్చే నెల నాలుగో తేదీలోపు సమస్యల పరిష్కారంపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ప్రతి ఊరునూ సమరక్షేత్రంలా మార్చి ఉద్యమించేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. పాదయాత్ర బృందం భోజన విరామం అనంతరం యాత్ర కొనసాగించింది. రుద్రమకోట, మద్దిగట్ల, వసంతవాడ, ఆర్వోపల్లి మీదుగా కుక్కునూరు మండలం దాచారం చేరుకుని రాత్రి బస చేసింది.

గిరిజనులపై యుద్ధం ప్రకటించిన బిజెపి

లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

పాదయాత్ర బృందం వసంతవాడ చేరుకున్నాక అక్కడ సభ నిర్వహించారు. అలసిన పాదయాత్ర బృందానికి ప్రజానాట్యమండలి కళాకారులు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ ఉత్సాహం నింపారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ బిజెపి వచ్చాక గిరిజనులపై యుద్ధం ప్రకటించిందన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు చట్టప్రకారం పరిహారం ఇవ్వకుండా మోసగిస్తుందన్నారు. వైసిపి, టిడిపి 2013 భూసేకరణ చట్టం అమలు చేయడం లేదన్నారు. భూమికి భూమితోపాటు పునరావాసం, పరిహారం ఏ ఒక్కటీ ఇవ్వలేదన్నారు. 1/70 అటవీ హక్కుల చట్టంపై బిజెపి దాడి చేస్తుందన్నారు. టిడిపి, జనసేన నిర్వాసితుల పక్షాన ఉంటారో, లేదో చెప్పాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులోని ఏడు మండలాల ప్రజలను పాలకులు ముంచడం దారుణమన్నారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన వైసిపి కాలక్షేపం చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఏం చెప్పారు.. ఏం చేశారు అని అడగడానికే పోలవరం పోరుకేక అని అన్నారు.

పోరాటానికి సిద్ధంగా ఉండాలి..

వి.శ్రీనివాసరావు

వసంతవాడ సభలో నిర్వాసితురాలు మడకం అక్కమ్మ గ్రామంలోని నిర్వాసితుల సమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తమ గ్రామం ముంపులో ఉండగా 45.72 కాంటూరులో పెట్టారన్నారు. భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు ఏదీ ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఇదే సమస్య ఉందని, పోరాడటానికి అంతా సిద్ధంగా ఉండాలని చెప్పారు. స్థానిక ఎంఎల్‌ఎ ఉలుకు పలుకు లేని బాలరాజుగా ఉన్నారన్నారు. వరదల్లో దెబ్బ తిన్న బాధితులకు జగన్ రెండు కొవ్వొత్తులిచ్చి సరిపెట్టారని ఎద్దేవా చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా యువత

పోలవరం పోరుకేక యాత్రలో యువతీ యువకులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. పాదయాత్ర బృందంలో అత్యధికంగా 18 ఏళ్ల నిండిన యువతీ యువకులే ఉన్నారు. యువత ఉత్సాహంగా అడుగులు వేస్తుంటే నాయకులు మరింత ఉత్సాహంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. దీంతో పాదయాత్ర ఉప్పెనలా ముందుకు సాగుతోంది.

అనారోగ్యంతో శిశువు మృతి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో శిశు మరణాలు ఆగలేదు. మండలంలోని భీమవరం పంచాయతీ రామచంద్రపురం గ్రామానికి చెందిన తల్లిదండ్రులు గెమ్మెలి భీమేశ్వరరావు నాగమణిల కుమార్తె పుట్టి మూడు నెలలు అయింది. శనివారం సాయంత్రం పాప నీరసంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. అనారోగ్యం బారిన పడి వాంతులు విరోచనాలతో ఆదివారం రాత్రి మరణించింది. మండలంలో పలు గ్రామాల్లో శిశు మరణాలు జరుగుతూనే ఉన్నాయి. మరణాలపై జిల్లా వైద్యాధికారులు దృష్టి సారించకపోవడంతోనే మరణాలు జరుగుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘ నేతలు టి. కృష్ణారావు తెలిపారు. ఇప్పటికైనా చిన్నారుల మరణాల నియంత్రణకు దృష్టి సాధించాలని, లేకుంటే బాధితులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



శిశు మృతదేహం



మానవహారం చేపడుతున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-పెదబయలు: పర్యావరణాన్ని పరిరక్షంచాలని మండల కేంద్రంలో సెంటాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మల ఆధ్వర్యంలో సోమవారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్‌ను విని యోగించ˘రాదని, కాలు ష్యాన్ని నివారించాలని తెలిపారు. అంబేద్కర్ కూడలి వద్ద మానవ హరంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కుసుమ గ్రేస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28న అరకులోయ మండల సమావేశం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకులోయ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 28న మండల ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో వి.నగేష్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నెలకొన్న వివిధ సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు అధికారులు హాజరు కావాలని కోరారు .గైర్హాజరైన అధికారులపై చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు.

సంతలో నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి - పెదబయలు : స్థానిక వారపు సంత మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌తో వాహనాలు నిలిచి పోయాయి. ఆదివారం రాత్రి నుండి మోస్తరు వర్షం కురుస్తుండటంతో మార్కెట్ బురదమయంగా మారింది. మెయిన్ రోడ్డు కిరు వైపులా బురద ఉండటంతో పాదచారులు, ద్వి చక్రవాహన దారులు నానా అవస్థలు పడ్డారు.



నిలిచిన వాహనాలు

రూ.246 కోట్లతో

గిరిజన మల్టీ స్పెషాలిటీ ఆరోగ్య కేంద్రాలు

-రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజని



మెడికల్ కళాశాల నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి రజని

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలో ఎంపిక చేసిన సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, బుట్టాయిగూడెం గిరిజన ప్రాంతాల గిరిజనుల కోసం రూ. 246 కోట్లతో గిరిజన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు చర్యలు తీసుకున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు విడదల రజని వెల్లడించారు. స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సికిల్‌సెల్ అనీమియా పరీక్షలను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది సికిల్‌సెల్ అనీమియాతో భాద పడుతున్నట్లు గుర్తించామని, మొదటి దశలో 6.50 లక్షల మందికి పరీక్షలు నిర్వహించి తగు చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. 40 సంవత్సరాల వయసు లోపు ఉన్న వారికి రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలల చిన్నారులు, గర్భిణీలు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సికిల్‌సెల్ అనీమియతో భాద పడేవారికి నెలకు పది వేల రూపాయలు ఫించను అందిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసారు. ముఖ్యమంత్రి గిరిజనులపై ఉన్న ప్రేమతో ఎంత డబ్బు ఖర్చైనా వెనుకాడకుండా మెరుగైన వైద్యం అందించడానికి మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం గొప్ప విషయమని అన్నారు. జిల్లాలో 67 మంది వైద్యులు, ఫ్యామిలి ఫిజీషియన్ కింద మరో 22 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారని వివరించారు.

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాలో సికిల్‌సెల్‌తో భాదపడే విద్యార్థులు ఐదు వందల పైగా ఉన్నారని, పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పాజిటివ్ వచ్చిన వారికి కార్డులు అందచేస్తారని, తద్వారా భాగస్వామిని నిర్ణయించటంలో తోడ్పాటు లభిస్తుందని వివరించారు. ముఖ్యమంత్రి వైద్యానికి పెద్ద పీట వేసారని, గిరిజన ప్రాంతాలలో కూడా 24 గంటల వైద్య సదుపాయాలు అందుతున్నాయని వివరించారు. రూ. 500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నారని తెలిపారు.

అరకు ఎంపి జి.మాధవి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జె.సుభద్ర, అరకు శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ, సికిల్‌సెల్ అనీమియా వ్యాధి వ్యాధి నియంత్రణ, పరీక్షలపై వివరించారు. భవిష్యత్తులో ఎవరికీ ఈ వ్యాధి రాకూడదని ఆకాంక్షించారు.

వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మాట్లాడుతూ, 40 ఏళ్ల లోపు వయసు ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి వివిధ కేటగిరీలకు సికిల్‌సెల్ అనీమియా పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను ప్రారంభించి తనిఖీలను పరిశీలించారు. రక్తదాన శిభిరాన్ని ప్రారంభించి రక్తదాతలను అభినందించారఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ . ఎస్. వెంకటేశ్వర్లు, జిసిసి, ట్రైకార్ చైర్పర్సన్లు శోభా స్వాతి రాణి, ఎస్.బుల్లిబాబు, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు వి.రామిరెడ్డి, సంయుక్త కలక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు వి.అభిషేక్, సూరజ్ గనోరే, మెడికల్ కౌన్సిల్ సభ్యులు టి. నరసింగ రావు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది నుండే మెడికల్ కళాశాల తరగతులు

వచ్చే విద్యా సంవత్సరం నుండే మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభించటానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి రజని స్పష్టం చేసారు. పాడేరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల ప్రగతిని పరిశీలించి తగు సూచనలు జారీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడుడూ, గతంలో వైద్య సేవలకు విశాఖపట్నం వెళ్ళవలసి వచ్చేదని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఐదు జిల్లాలలో కొత్తగా తరగతులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకున్నారని వివరించారు. ఇటీవల ముఖ్యమంత్రి 49 వేల పైగా ఖాళీలు భర్తీ చేసారని గుర్తు చేసారు.

మోదకొండమ్మను సన్నిధిలో రజిని

పాడేరులో మోదకొండమ్మ అమ్మవారిని మంత్రి విడదల రజని సోమవారం దర్శించుకున్నారు. మంత్రికి పలవురు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు అందించారు.

శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

పాడేరు: వైద్యరంగంలో స్త్రీ వైద్య నిపుణులు (గైనకాలజిస్ట్)గా 20 ఏళ్ల అపార అనుభవమున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్, ఈ ప్రాంత వాసి డాక్టర్ తమర్బ నర్సింగరావు పాడేరులో నూతనంగా నెలకొల్పిన శ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడుదల రజిని సోమవారం ప్రారంభోత్సవం చేశారు. పురోహితుల వేదమంత్రాలు మధ్య రిబ్బన్ కత్తిరించి హాస్పటల్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పటల్లో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పరిశీలించారు. వైద్య సేవలపై ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్బ నర్సింగరావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ సభ్యులు గొడ్డేటి మాధవి , అరకు ఎమ్మెల్యే శ్రీ చెట్టి పాల్గుణ , జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -పెదబయలు: స్థానిక రెసిడెన్సియల్ పాఠశాల లోని సమావేశం మందిరంలో సోమవారం ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్షపై సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా అడిట్ అధికారిని సువర్ణ పణి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్షను జయప్రదం చేయాలని కోరారు. ప్రతి గ్రామ సచివాలయంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ వాలంటీర్స్ సమస్యలను యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. దీనిలో భాగంగా టోకెన్ జన రేటర్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ నరసింగరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అడిట్ అధికారిని సువర్ణ పణి

అక్రమ బదిలీలపై నిరసన

ప్రజాశక్తి -హుకుంపేట: అక్రమ బదిలీలను నిరసిస్తూ నిరసన చేపట్టామని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శి తాపుల.క్రిష్ణారావు, జిల్లా కమిటి సభ్యులు వి లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మైదాన ప్రాంత ఉపాధ్యాయులను గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం బదిలీలు చేయడం సరికాదన్నారు. జీఓ 3పై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్లో ఉండగా గిరిజనేతర ఉపాధ్యాయులు 400 మందిని బదిలీలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శం అన్నారు. వీటిపై గిరిజన ఎమ్మెల్యేలు నోరు మెదపక పోవడం విచారకరమఅన్నారు. తక్షణమే అక్రమ బదిలీల ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దర్మయ్యదొర, కొండబాబు, అప్పన్న, నిరుద్యోగ యువతీ, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నినాదాలు చేపడుతున్న నాయకులు



108లో గర్భిణి ప్రసవం

ప్రజాశక్తి -అనంతగిరి: పురిటి నొప్పులతో బాధపడుతూ వైద్య సేవల కోసం ఆసుపత్రిలో 108 అంబులెన్స్ తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రసవం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి ఎన్ఆర్ పురం పంచాయతీ పెద్దరు గ్రామానికి చెందిన జన్ని, రాములమ్మను తరలిస్తుండగా ప్రసవం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తల్లీబిడ్డలను తరలించారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో నూతనంగా ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసుల పరిశీలన, విచారణ నిమిత్తం జిల్లా విజిలెన్సు మరియు మానిటరింగ్ కమిటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు కమిటీలో ఎస్సీ, ఎస్టీ లకు చెందిన వారికి (05) మందికి, స్వచ్ఛంద సంస్థల నిర్వహకులు ఇతర కులముల (నాన్ ఎస్సీ ఎస్టీ) వారికి (03)కి అనధికారి సభ్యులుగా నియమించుటకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అవకాశము ఉందన్నారు. కమిటి కాలపరిమితి 2 సంవత్సరములుం ఉటుందని తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను తగిన ధ్రువపత్రములతో జూలై ఏడవ తేదీ లోపు జిల్లా ఎస్సి సంక్షేమ సాధికారిత అధికారి (పాడేరు) కార్యాలయంలో అందజేయాలని కలెక్టర్ కోరారు. ఇతర వివరాలకు పోన్: 8985868068 నంబరుకు సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-పెదబయలు :అరడకోట ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాన ఉపాధ్యాయుడు పూర్ణచందర్ మాట్లాడుతూ, బడి ఈడు గల పిల్లలందర్నీ బడిలో చేర్పించాలన్నారు. జెవికె కిట్స్, అమ్మ ఒడి, ఆణిముత్యాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి హుకుంపేట:-మండలం లోని గడికించు మండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఎం.ప్రభాకర్‌కు బదిలీ కావడంతో సోమవారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎన్నో సేవలు అందించారని గ్రామ ప్రజలు కొనియాడారు.



ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న గ్రామ ప్రజలు

గిరిజన సమస్యలు పట్టించుకోరా..

ఆరోగ్య మంత్రి తీరుపై ఆదివాసీ గిరిజన సంఘాల నిరసన

ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి వినతి పత్రం



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఏజెన్సీ పర్యటనకు సోమవారం విచ్చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని గిరిజన సమస్యలపై వినతులు స్వీకరించక పోవడంపై ఏపీ ఆదివాసి గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య నాయకులు స్థానిక కాఫీ హౌస్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న పడాల్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ, పలు గిరిజన సమస్యలపై తాము మంత్రికి వినతి పత్రం ఇవ్వాలని అధికారులను సోమవారం ఉదయం అనుమతి కోరగా ఐటిడిఏ వద్ద వేచి ఉండాలని చెప్పారని మధ్యాహ్నం తర్వాత కాఫీ హౌస్ వద్ద వేచి ఉండాలని చెప్పారని చివరికి ఆరోగ్య శాఖ మంత్రి వినతులు తీసుకోకుండానే వెళ్లిపోయారని చెప్పారు. మంత్రి వెళ్లిపోవడంతో తాము ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ బాబుకు క వినతి పత్రం అందచేశామని తెలిపారు. తాము తెలిపిన ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమాల్లో గత ఏడాది జరిగిన గిరిజన విద్యార్థుల మరణాలపై జ్యూడిషియల్ విచారణ నిర్వహించాలని, ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని, కస్తూర్బ గాంధీ పాఠశాలలు మరియు కళాశాలలో గత 9 సంవత్సరాలుగా పనిచేస్తున్న అధ్యాపకులను తక్షణమే రెన్యువల్ చేసి విధుల్లోకి తీసుకోవాలని కెజిబివి సిఆర్ గెస్ట్ ఫ్యాకల్టీ మరియు పిజిటి గెస్ట్ ఫ్యాకల్టీని కాంట్రాక్టు పద్ధతుల్లో మార్చాలని అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత లేకుండా చూడాలని పాడేరు, అరకువేలి, చింతపల్లి, ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్య నిపుణులను నియమించాలని ఏజెన్సీలో ప్రతి ఇంటింటికి దోమతెరలు పంపిణీ చేయాలని, 11 మండలాల్లో గల ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్స్ ను నియమించి గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కే ప్రభుదాస్ జిల్లా నాయకులు చిన్నారావు సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్ సుందర్రావు పాల్గొన్నారు.

లేటరైట్ అనుమతులు రద్దుచేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:నాతవరం మండలం సుందరకోట పంచాయతీ బమిడికలొద్ది, అసనగిరి గ్రామాల అటవీ సరిహద్దు ప్రాంతంలో లేటరైట్ మైనింగ్ తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని సిపిఎం నాయకులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, బినామి గిరిజనేతరడు జర్తా లక్ష్మణరావుకు మంజూరు చేసిన సుమారు 300ఎకరాల లేటరైట్ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలన్నారు. 5వ షెడ్యూల్డ్ ఏరియా చట్టం 1950 అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రయోజనాలను రక్షించి గిరిజనులను కాపాడాలన్నారు. ఈ విషయమై జాయింట్ కమిటీ విచారణ నిమిత్తం బమీడికలొద్ది లెటర్ రైట్ ప్రాంతానికి ఈనెల 28న వస్తుందని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. భూమిని జర్తా లక్ష్మణరావుకు 20 ఏళ్ల కాల పరిమితి వరకు తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, వీటిని మించి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలు చేపట్టి వందలాది చెట్లు తొలగించారని విమర్శించారు. ఆదివాసులు సాగు చేస్తున్న పోడుభూములు, అటవీ ప్రాంతాన్ని గ్యాప్ ఏరియా పేరుతో మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇచ్చారన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ఖనిజ తవ్వకాలు గిరిజనేతరులకు, బినామిలకు ఇవ్వడం చట్టవిరుద్ధమని, సరుగుడు ప్రాంతాల్లో లేట రైట్ ఖనిజ తవ్వకాలు చేపట్టడం నేరమన్నారు. ఈ అక్రమాలపై దర్యాప్తు జరిపి విలువైన ఖనిజ సంపదను అక్రమంగా దోపిడి చేస్తున్న వారిని శిక్షించాలన్నారు. గిరిజన, అటవీ పర్యావరణ, ఖనిజ నియంత్రణ చట్టాలను ఉల్లంఘించిన అధికారులు, ప్రయివేటు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసా చట్టం ప్రకారం అసనగిరిలో గ్రామ సభ నిర్వహించకుండా మైనింగ్ తవ్వకాలు చేయడం నేరమన్నారు. మైనింగ్ ప్రాంతంలో సుమారు 10 కిలోమీటర్ల వరకు పోడు, సాగు భూమి కలుషితమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, కెవీ సూర్యప్రభ పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు మొర

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం వెంకటాపురం గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు స్థానికులు మొర పెట్టుకున్నారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, గ్రామస్తులు అధిక చార్జీలు చెల్లించి ఆటోలో ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామంలో కాలనీ ఇల్లు మంజూరుకు వేడుకున్నారు. గతంలో గ్రామ శివారున ఇచ్చిన కాలనీ స్థలం నివాసయోగ్యం కాకపోవడంతో లబ్ధిదారులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో తాగునీటి, డ్రెయినేజీ, పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో అధికారులతో సమావేశమై సచివాలయ సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని మండల ప్రత్యేక అధికారి డిఎల్‌డిఓ అరుణశ్రీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు పైలా రమేష్, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ ఇందిరా శ్రీదేవి, తహసిల్దార్ జానకమ్మ, ఏఓ చంద్రశేఖర్, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన బైక్

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని సంతబయలు గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. వివరాల్లోకి వెళితే. నర్సీపట్నం గ్రామానికి చెందిన రాము ద్విచక్ర వాహనంపై పాడేరు వెళ్తున్నాడు. మార్గమధ్యలో సంత బయలు గ్రామ సమీపంలో రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో బైకు అదుపుతప్పి బోల్తా పడింది. 108లో పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-గొలుగొండ: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గొలుగొండ మండలం ఏఎల్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు పూర్తి అయిన వాళ్లకి మాత్రమే అర్హులని ప్రకటించిందని, 2009లో ఏజెన్సీ రిక్రూట్ అయిన వారు ఏజెన్సీ పరిస్థితి దృష్ట్యా 2011 నుంచి 2018 సంవత్సరాల్లో ఏజెన్సీ రిక్రూట్ జరిగాయన్నారు. మైదాన ప్రాంత ఉద్యోగులతో సమానంగా ఏజెన్సీ ప్రాంత ఉద్యోగులను చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు నాగమణి, వి.ప్రశాంత్‌కుమారి, ఫార్మసిస్ట్ కె.చిట్టిబాబు, హెల్త్ అసిస్టెంట్లు ఉపేంద్ర, ప్రకాష్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : గడపగడపకి మన ప్రభుత్వ కార్యక్రమం నర్సీపట్నం మున్సిపాలిటీ శారదనగర్ లో సోమవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, స్థానిక నాయకులతో కలిసి వార్డు పరిధిలో కోటి 15 లక్షలతో అభివృద్ధి చేసిన పనులను పర్యవేక్షించారు. గడపగడపకూ తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ అధికారులు, మున్సిపల్ చైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ ఛైర్మన్‌లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు ఏకాశివ, సచివాలయల కన్వీనర్ తమరాన శీను, యూత్ అధ్యక్షుడు దనిమిరెడ్డి ప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్‌పికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఇటీవల నర్సీపట్నం ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అదిరాజ్ సింగ్ రాణాను సోమవారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, నర్సీపట్నంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని, ర్యాష్ డ్రైవింగ్ పై దృష్టి సారించాలని కోరారు. కళాశాలలు, పాఠశాలలు, ఆర్టీసి బస్టాండ్ వద్ద ఈవ్ టీజింగ్ జరగకుండా గస్తీ ఏర్పాటు చేయాలని తెలిపారు. . ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, రెండో వార్డు ఇన్చార్జ్ మొండెం శివ, నమ్మి రమణరాజు, వీసం వెంకటేష్ పాల్గొన్నారు.

6న బియ్యం వేలం

ప్రజాశక్తి -కోటవురట్ల:ఇటీవల మండలంలో పలు ప్రాంతాల్లో6 ఎ కేసులో పట్టుబడ్డ పిడిఎస్ బియ్యంను ఈనెల 6న వేలం నిర్వహించనున్నట్లు తహసిల్దార్ జానకమ్మ తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని ఇటీవల రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట జయరాం పరిశీలించారన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో వివిధ ప్రాంతాల్లో పట్టుబడ్డ 144.22 క్వింటాళ్ల బియ్యాన్ని వచ్చే నెల 6న కోటవురట్ల ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలం నిర్వహించనునట్లు తెలిపారు, ఆసక్తి కలవారు వేలంపాటలో పాల్గొనవలసిందిగా ఈ సందర్భంగా ఆమె కోరారు,

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - చీడికాడ: విద్యార్థులు చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రధానో పాధ్యాయుడు బి.వి.రమణ అన్నారు చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బివి రమణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పలు పథకాలు అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. దాతలు గోపి కొండలరావు, విద్యాసాగర్‌లు ఉచితంగా ఇచ్చిన హిందీ, తెలుగు కాపీ రైట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మణ్, స్కూల్ కమిటీ చైర్మన్ పెచ్చేటి రాము, ఉపాధ్యాయులు శ్యామ్ కుమార్, కుమారి పాల్గొన్నారు.



పెచ్చులూడిన రహదారి

మూడు వారాలకే పెచ్చులూడిన జిఎం.వలస రహదారి

- కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ప్రభుత్వం రదాదారుల అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయించగా, కొంత మంది అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఆ నిధులను దిగమింగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు మారేడుమిల్లి జిఎం వలస తారు రోడ్డు నిలుస్తుంది. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 2 కోట్ల 42 లక్షలతో స్థానిక కాఫీ తోటల జంక్షన్ నుంచి జిఎం.వలస వరకు 7 కిలోమీటర్ల మేరకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతేడాది రోడ్డు పనులు ప్రారంభించినా, నత్త నడకన సాగాయి. ఎట్టకేలకు ఈ రోడ్డు పనులు జూన్ మొదటి వారంలో పూర్తి చేశారు. అయితే ఈ ఏడు కిలోమీటర్లు వేసిన తారు రోడ్డు చాలా పాలసగా, ఒక లేయర్ మాత్రమే వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ తారురోడ్డు పెచ్చులు ఊడుతున్నాయి. కనీసం పదేళ్ల పాటు మన్నాల్సిన రోడ్డు నెల కాకుండానే పెచ్చులూడిపోవడం పట్ల స్థానిక గిరిజనులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల నిధులు ఏమయ్యాయని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఏదో నామకావస్తుగా రోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారం కాంట్రాక్టర్ పనులు చేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా జాతీయ సేవా పథకం (ఎన్‌సిసి) ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు మాట్లాడుతూ గంజాయి, కొకైన్, గుట్కా లాంటి మాదక ద్రవ్యాలకు యువత బానిసలవుతూ, యుక్త వయసులోనే అనేక వ్యాధులకు గురవుతున్నారని, తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శేఖర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. హారతి, అధ్యాపకులు జి.వెంకట్రావు, డాక్టర్ వై.పద్మ, ఎస్.అప్పనమ్మ, కె.శకుంతల, కె.శ్రీదేవి, సిహెచ్.రాజబాబు, ఎన్.రమేష్, ఆర్.మౌనిక, గౌతమి, సాయికుమార్, సిబంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జెన్‌కో కాలనీలో డ్రెయినేజీల్లో పూడికతీత

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కాలనీలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులు సోమవారం చేపట్టారు. వర్షాలు ప్రారంభం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఏడిఈ క్యాంపు అప్పలనాయుడు, ఎఇ సురేష్ ఆధ్వర్యాన జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు డ్రైనేజీ పుడికితీత పనులు నిర్వహించారు. 5వ క్రాస్ రోడ్ నుంచి మార్కెట్ వరకు రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీలలో ఉన్న చెత్తచెదారాలు, వ్యర్థపదార్థాలను తొలగించారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండ, సీలేరు పరిసర ప్రాంతాల్లో జీకే వీధి సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యాన పోలీసులు ఆది, సోమవారాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, పేలుడు పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అత్యంత పరిజ్ఞానం గల పరికరాలను ఉపయోగిస్తూ డాగ్ స్క్వాడ్ బృందాలతో అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న స్మగ్లర్లు వారికి సహకరిస్తున్న కోవర్టులపై సిఐ అశోక్ కుమార్ ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

వైసిపి పాలనలో విద్యారంగం విధ్వంసం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి, విఆర్.పురం, కూనవరం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐవి

వైసీపీ పాలనలో విద్యారంగం పూర్తిగా విధ్వంసానికి గురైందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు విమర్శించారు. విఆర్ పురం మండలంలో కస్తూర్బా పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారని, అయితే కేవలం ఒక ఎస్ఓ, ఒక పీఈటి, ఒక తెలుగు టీచర్ మాత్రమే ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు తరగతిలో బోధించేందుకు వసతికి ఓకే గది అందుబాటులో ఉందని చెప్పారు. నాడు నేడు, సబ్జెక్ట్ టీచర్లు, ఇంగ్లీష్ మీడియం విద్యా బోధన పేర్లు చెప్పి విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నామంటూ ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, గత ఐదేళ్లుగా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు. ఒక్క డీఎస్సీ కూడా తీయని ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని విమర్శించారు. విద్యారంగ అభివృద్ధికి కీలకమైన ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ఉత్తమ ఫలితాలు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఉద్యోగుల ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధాన అజెండాగా ప్రకటించి అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. గడిచిన నాలుగేళ్లలో పాఠశాలల విలీనం, ఖాళీ పోస్టుల రద్దు చేశారని, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేదని మండిపడ్డారు.

క్రూయిజ్ టర్మినల్‌కు కేంద్రం ఎగనామం ?

రూ.77 కోట్ల అంచనాలతో తయారై రూ.100 కోట్లకు పెరిగిన నిర్మాణ వ్యయం

రూ.19 కోట్లతో చేతులెత్తేసిన కేంద్ర పర్యాటక శాఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పోర్టు నుంచి అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకుగానూ పోర్టు, కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా అమలు చేయాల్సిన 'క్రూయిజ్ టర్మినల్'కు కేంద్రం నిధులివ్వకుండా ఎండగడుతోంది. 2020 సంవత్సరానికి ముందు నుంచీ 'క్రూయిజ్ టర్మినల్' అంటూ కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ఊరిస్తూ ఉంది. తొలుత రూ.77 కోట్ల అంచనాతో ఈ టర్మినల్‌కు పోర్టు సాంకేతిక విభాగ అధికారులు అంచనాలు రూపొందించారు. తాజాగా నిర్మాణ జాప్యం వల్ల రూ.100 కోట్లకు చేరినట్లు పోర్టు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. టర్మినల్‌కు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ) నివేదికను కూడా కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ స్వీకరించింది. ఈ క్రమంలో ఆ నిధుల్లో 50 శాతం కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ, మిగిలిన 50 శాతం కేంద్ర పర్యాటక శాఖ ఇవ్వాల్సి ఉంది. ఇంతవరకూ రూ.19 కోట్లు మాత్రమే కేంద్రం నుంచి వచ్చాయి. పోర్టు హార్బర్‌లో క్రూయిజ్ టర్మినల్ కోసం పరిపాలన భవనానికి సైతం 2021లో శంకుస్థాపన జరిగింది. ఈ టర్మినల్ భవన నిర్మాణ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. పోర్టు అధికారులు కేంద్ర పర్యాటక శాఖకు నిధుల కోసం లేఖలు రాస్తున్నా సరైన రీతిలో స్పందన రావడం లేదు.

సముద్ర మార్గంలో పర్యాటకుల రాకపోకలే లక్ష్యం

క్రూయిజ్ టర్మినల్ ద్వారా సముద్ర మార్గంలో విదేశీ పర్యాటకులు, యాత్రికులను ఆకట్టుకునేందుకు పోర్టు యాజమాన్యం తన ఆదాయ సముపార్జనకు ప్రణాళికలు రూపొందించినా కేంద్ర సహకారం ఉండడం లేదు. చెన్నయ్‌కు చెందిన ఐఐటిలో ఈ బెర్తు, టర్మినల్ నిర్మాణాలకు డిజైన్ కూడా చేయించడం పూర్తయింది. టర్మినల్ పనులు పూర్తయ్యేందుకుగానూ నిధుల కొరత వెంటాడుతోంది. 2022 ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలని తొలుత కార్యాచరణ తయారు చేసినా నేటికీ టర్మినల్ పనులు 50 శాతం కూడా పూర్తికాలేదు. మొత్తంగా 4500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ టర్మినల్ భవన పనులను చేపట్టాల్సి ఉంది. నగరంలోని పర్యాటకులను విదేశీ ప్రదేశాలకు తీసుకెళ్లి అక్కడ నుంచి ఇక్కడకు మరలా తీసుకొచ్చే ఏర్పాట్లు ఈ టర్మినల్ ద్వారా జరిగే అవకాశాలున్నాయి. పోర్టు ప్రాంతంలో (టర్మినల్ వద్ద) 7 బస్సులు, 70 వరకూ కార్లు, ద్విచక్ర వాహనాలు నిలుపుకునేలాగ పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో మొత్తంగా క్రూయిజ్ టర్మినల్ పనులు 12,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జరగాల్సి ఉంది. 300 మీటర్ల పొడవైన భారీ క్రూయిజ్ నౌకలు కూడా విశాఖ పోర్టుకు ఇది తయారైతే వస్తాయని పోర్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

పూర్తయితే.. దేశంలో నాలుగోది..

దేశంలో క్రూయిజ్ నౌకలకు ఇలా ప్రత్యేకంగా బెర్తు, టర్మినల్ సదుపాయం కలిగిన రాష్ట్రాలు చెన్నయ్, గోవా, కొచ్చిన్ మాత్రమే. విశాఖలో టర్మినల్ తయారైతే నాలుగోది కానుంది. టర్మినల్ ద్వారా 2 వేల మంది ప్రయాణికులకు సేవలు అందించవచ్చు. అయితే 2022లో ఒకసారి ట్రయల్ రన్ కింద క్రూయిజ్ టర్మినల్‌ను విశాఖ నుంచి చెన్నయ్‌కి నడపగా మార్గమధ్యలో సాంకేతిక సమస్యల వల్ల ట్రయల్ రన్ కూడా ఆగిపోయింది.

జులై నాటికి పూర్తిచేస్తాం :
ఎంపీ జివిఎల్ నరసింహారావు

తాజాగా బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు సోమవారం విశాఖ పోర్టులో నిర్మాణంలోని క్రూయిజ్ టర్మినల్ భవన పనుల సందర్శనకు వెళ్లారు. ఈ ఏడాది జులై నాటికి ఈ నిర్మాణ పనులను పూర్తిచేస్తామంటూ పోర్టు అధికారులకు వెల్లడించారు. నిధుల సంగతి మాత్రం ప్రస్తావించకపోవడం ఇక్కడి విశేషం.

బలవంతపు ల్యాండ్ పూలింగ్ ఆపాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా పద్మనాభం, అనందపురం, భీమునిపట్నం మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన బలవంతపు ల్యాండ్ పూలింగ్‌ను వెంటనే నిలిపివేయాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 770 ఎకరాల ల్యాండ్ పూలింగ్ కోసం విఎంఆర్‌డిఎను పురికొల్పినట్టు తెలిసి ఆయా మండలాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ వల్ల రైతులు భూమిని, పంటను, ఉపాధిని కోల్పోతారన్నారు. తరతరాలుగా సంక్రమించిన ఆస్తిని వారసులకు అందించే అవకాశం లేకుండా పోతారన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులకు ఉపాధి క్షీణిస్తుందని తెలిపారు. పశుపోషణ కష్టతరమవుతుందని పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్‌పై ఇప్పటికే రైతులు సంబంధిత అధికారులకు, ప్రభుత్వానికి తమ అభ్యంతరాలను, వ్యతిరేకతను తెలియజేశారన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జెడ్‌పిటిసి

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి

ప్రజాశక్తి - మారేడుమిల్లి : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జెడ్పిటిసి సభ్యుడు గొర్లె బాలాజీ బాబు అన్నారు. సోమవారం ఆయన ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబుతో కలిసి మండలంలోని రామన్నవలస, దేవరపల్లి గ్రామాలలోని పాఠశాలలను సందర్శించారు. పుస్తకాలు, బ్యాక్స్, యూనిఫామ్ అందరికీ అందాయ లేదా, విద్యా బోధాన ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది, ఈ ఏడాది పదవ తరగతిలో మండలం ఫస్ట్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు జడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు రూ.1000 రూపాయలు, సర్పంచ్ కొండ జాకబ్, వైస్ ప్రెసిడెంట్ వీరబాబు 500 రూపాయలు చొప్పున నగదును అందజేశారు.

స్పందనకు 47 దరఖాస్తులు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 47 అర్జీలు అందాయి. వీటిని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. ఏజెన్సీలోని శ్రీసత్యసాయి వాటర్ వర్క్స్‌లో పని చేస్తున్న 59 మందికి 14 నెలల నుండి జీతాలు చెల్లించకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే జీతాలు ఇప్పించాలని, కొన్ని మోటార్లకు మరమ్మతులు చేయించాలని ఎస్.బాలరాజు. యం.దుర్గారావు. సిహెచ్.స్వామి దొరతో పాటు 30 మంది కార్మికులు విన్నవించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన సీతారాం గ్రామస్తులకు పోలవరం ఆర్ అండ్ ఆర్ కాలనీ-2లో తాగునీరు సరఫరాకు సంబంధించిన వాటర్ ట్యాంక్ సరిగా పనిచేయడం లేదని, దానికి మరమ్మతులు చేపట్టాలని శీర్షం కృష్ణ దొర, కుంజం వెంకటరమణ, శీర్షం బాలకృష్ణ, చవలం సూరి దొర దరఖాస్తు సమర్పించారు. వై.రామవరం మండలం చింతలపూడి గ్రామ సమీపంలోని 150 ఎకరాలకు సాగునీరు అందించే కన్నీరు వాగు చెక్ డ్యామ్ కెనాల్‌లో పూడిక తీయించాలని పల్లాల లచ్చిరెడ్డి, రంపచోడవరం మండలం రాకోటలో తాగునీటికి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కత్తుల సోమిరెడ్డి, నూకలేటి కామేశ్వరరెడ్డి, కుర్ల రత్నారెడ్డి అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డియస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, పీహెచ్‌ఓ కె.చిట్టిబాబు, తహశీల్దారులు పివివి జయ సూర్య కుమార్, డాక్టర్ ఓబి.ఇందిర, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, హార్టికల్చర్ అధికారి రాంబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి చౌదరి, ఏఎంవో సి.శ్రీహరి, డాక్టర్ రాధిక ఇతర అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమావేశం

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం మండలం తామరపల్లి సచివాలయంలో కౌలు రైతుల సమావేశం సోమవారం జరిగింది. ఇందులో పాల్గొన్న ముసురిమిల్లి ఎంపీటీసీ వంశి కుంజం మాట్లాడుతూ భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయ చేస్తున్నారో వారు పట్టాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకోవాలని, దీని వల్ల పంటకి నష్టం జరిగితే నష్ట పరిహారం ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. గిరిజనలకు 90శాతం రాయితీతో విత్తనాలు ఇస్తున్నారన్నారు. రైతులు పెంచుకునే ఆవు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు ఏడాదికి 292 చొప్పున బీమా చేస్తే ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే ఈ బీమా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లక్ష్మీ, చిట్టిదొర, రైతు భరోసా కమిటీ చైర్మన్ కుంజం అబ్బులు, విఆర్వో సత్యనారాయణ, కార్యదర్శి కృష్ణమోహన్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కౌలు రైతులు పాల్గొన్నారు.